ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -54 పేజీలు - 05 వెల - 04/- గురువారం 26 ఫిబ్రవరి 2026

# వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా



- వెలిగొండ పూర్తి కాకుండానే జగన్ రిబ్బన్ కట్
- పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం
- వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా
- ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా

## వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు

**మార్కాపురం, ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

మిగతా 2లో.



# ఉగ్రవాద పోరులో అండగా ఉంటాం

హమాస్ దాడిని ఖండిస్తున్నాం,ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలుస్తాం

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

: ఆ దేశ పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ప్రసంగం బహిష్కరించిన ప్రతిపక్షాలు



**జెరూసలేం : ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

ఉగ్రవాద పోరులో అండగా ఉంటామనీ, ఇజ్రాయిల్‌పై 2023 అక్టోబర్‌లో హమాస్ చేసిన దాడిని ప్రధాని మోడీ ఖండించారు. హమాస్ దాడిని అనాగరిక చర్యగా విమర్శించారు. ఇజ్రాయిల్‌కు అండగా ఉంటామని చెప్పారు. రెండురోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఆ దేశ పార్లమెంట్‌లో మోడీ ప్రసంగించారు. హమాస్ దాడి గురించి మాట్లాడుతూ "మీ బాధను మేం అనుభవిస్తున్నాం. మీ బాధను పంచుకుంటాం. ప్రస్తుతం, భవిష్యత్‌లో కూడా ఇజ్రాయిల్‌పై పూర్తి నమ్మకంతో ధృఢంగా

మిగతా 2లో.

# తెలంగాణలో హత్యా రాజకీయాలు



- : కుమ్మెర ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
- చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్
- సమాజం తలదించుకోవాల్సిన ఘటన జరిగిందన్న కేటీఆర్
- నిందితులను కాపాడే ప్రయత్నం సిగ్గుమాలిన చర్య అన్న కేటీఆర్

2లో.

# 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి'


పాఠ్యాంశంపై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు

వెంటనే తొలగిస్తామని ప్రకటించిన కేంద్రం

న్యూఢిలీ **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి' అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో కేంద్రం వెంటనే స్పందించింది. పాఠ్యాంశం లోని

మిగతా 2లో.






# జగన్ చేసేనిరాధార ఆరోపణలకు సమాధానం చెప్పాలా

హెరిటేజ్‌కు విఎస్ఆర్ ఏవియేషన్‌కు ఏం సంబంధం

బొత్స దృష్టిలో గజదొంగ అంటే జగనా

మీడియా చాట్‌లో లోకేశ్

అమరావతి, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

బాబాయ్‌ని చంపి కత్తి తమ చేతిలో పెట్టినట్లే.. వీఎస్ఆర్ ఏవియేషన్ విషయంలో వైకాపా ఆరోపణలు ఉన్నాయని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. మీడియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. హెరిటేజ్ ఫిన్ లీస్ అనేది 1996లో స్థాపించిన సంస్థ. అనేక ఇతర సంస్థల మాదిరిగానే 2022లో హెరిటేజ్ ఫిన్ లీస్ వద్ద వీఎస్ఆర్ ఏవియేషన్ ఫైనాన్స్ తీసుకుంది.

మిగతా 2లో.



# ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే

అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన



2లో.

# సిఎం రేవంత్‌తో అడోబ్ సిఇవో శంతన్ భేటీ

హైదరాబాద్, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అడోబ్ సీఈవో శంతను నారాయణ్ కలిశారు. హైదరాబాద్‌లో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ రైజింగ్ బోర్డు సభ్యుడిగానూ శంతను కొనసాగుతున్న నేపథ్యంలో గ్లోబల్ ట్రెండ్స్, కొత్త అవకాశాలతో రేవంత్‌తో చర్చించారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, గ్రీన్ ఎనర్జీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఏఐని సమర్థంగా వినియోగించుకునే విషయంపై శంతను నారాయణ్‌తో రేవంత్ చర్చించారు.



# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

కడియం, దానంలపై తుది విచారణ

-27,28 తేదీల్లో విచారణకు సిద్ధం

హైదరాబాద్, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారం కీలక దశకు చేరుకొన్నది. ఇప్పటికే 8మంది విషయంలో స్పీకర్ స్పష్టమైన తీర్పును ఇచ్చారు. వీరు పార్టీ మారినట్టుగా ఆధారాలు లేవని స్పీకర్ తీర్పును ఇచ్చారు.

మిగతా 2లో.



# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

- నందిపల్లి గ్రామంలోని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జగన్
- భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి వెల్లివిరుస్తుందని వ్యాఖ్య
- ఆలయ కమిటీని అభినందించిన జగన్



2లో.

# ఉగ్రవాద పోరులో అండగా ఉంటాం

భారత్ నిలుస్తుంది" అని మోడీ చెప్పారు. ప్రజలను చంపడాన్ని, ఉగ్రవాదాన్ని ఏ కారణమూ సమర్థించదని అన్నారు. "భారత్ కూడా ఉగ్రవాద బాధను భరించింది. 26/11 ముంబయి దాడుల్లో ఇజ్రాయిల్ పౌరులతో సహా అనేక మంది అమాయక ప్రజల ప్రాణాలను కోల్పోయిన సంఘటనలను మేం ఎల్లప్పుడు గుర్తుంచుకుంటాం. ఉగ్రవాదంపై సహనం లేని, రాజీలేని విధానాన్ని మేం కలిగి ఉన్నాం. ఇందులో ఎటువంటి ద్వంద్వ ప్రమాణాలూ లేవు" అని మోడీ తెలిపారు. శాంతి మార్గం ఎల్లప్పుడూ సులభం కాదని, కానీ ఈ ప్రాంతంలో చర్చలు, శాంతి, స్థిరత్వం కోసం ఇజ్రాయిల్‌తో ప్రపంచంతో పాటు భారత్ కలిసి ఉంటుందని మోడీ చెప్పారు.

ఈ ప్రాంతంలో శాంతికి యూఎన్ భద్రతా మండలి ఆమోదించిన గాజా శాంతి ఒప్పందం ఒక మార్గాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. భారత్‌లో యూదు ప్రజలు ఎలాంటి హింస, వివక్ష లేకుండా జీవిస్తున్నారని చెప్పారు. "భారత్‌లో యూదులు తమ విశ్వాసాలను కాపాడుకు న్నారు. సమాజంలో పూర్తిగా కలిసిపోయారు" అని మోడీ తెలిపారు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచంలో భారత్, ఇజ్రాయిల్ వంటి విశ్వసనీయ భాగస్వాముల మధ్య బలమైన రక్షణ భాగస్వామ్యం చాలా ముఖ్యమని కూడా మోడీ తెలిపారు. త్వరలోనే భారత్ ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందనీ, మరోవైపు ఇజ్రాయిల్ ఆవిష్కరణ, సాంకేతిక రంగాలల్లో శక్తివంతమైన దేశమని చెప్పారు. భారత్, ఇజ్రాయిల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యమని మోడీ అన్నారు. మోడీకి ఇజ్రాయిల్ పార్లమెంట్ 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ పతకం'ను ప్రదానం చేసింది. నెస్సెట్ అత్యున్నత గౌరవంగా భావించే ఈ పతకాన్ని భారత్-ఇజ్రాయిల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడానికి చేసిన అసాధరణ కృషికి గుర్తింపుగా ప్రదానం చేస్తున్నట్టు పార్లమెంట్ తెలిపింది.

### మోడీ ప్రసంగాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు

భారత ప్రధాని మోడీ పర్యటనకు ముందు ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో గందరగోళం చెలరేగింది. ఇజ్రాయిల్‌లోని ప్రతిపక్ష పార్టీలు నెస్సెట్ (ఇజ్రాయిల్ పార్లమెంట్)లో మోడీ ప్రసంగాన్ని బహిష్కరించాయి. నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా నిర్ణయంతో వివాదం ప్రారంభమైంది. నెతన్యాహు ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను విస్మరిస్తోందని, దీనితో భారత ప్రధాని ప్రసంగానికి హాజరు కాకూడదని నిర్ణయించాయి. ప్రతిపక్షాల బహిష్కరణతో భారత ప్రధాని పర్యటన చుట్టూ అసౌకర్య వాతావరణాన్ని ఏర్పర్చింది. మోడీ ప్రసంగించే సమయంలో పార్లమెంటులో సగం సీట్లు ఖాళీగా ఉండటం ప్రతికూల సందేశాన్ని పంపినట్టయ్యింది. ఈ పరిస్థితిని నివారించడానికి ఉన్న సభ్యులను నిలబెట్టి మోడీ..మోడీ అంటూ నినాదాలు చేయించటం గమనార్హం.

### ఇజ్రాయిల్‌లో రెండోసారి పర్యటించిన మోడీ

ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం "ఇజ్రాయిల్ , భారత్ మధ్య అద్భుతమైన పొత్తు ఉన్నది. మేం అన్ని రకాల సహకారాన్ని చర్చించబోతున్నాం" అని వివరించింది. గతేడాది ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా ఇజ్రాయిల్ , భారత్ పరస్పర వాణిజ్యాన్ని విస్తరించడానికి పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేశాయి. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి అనాగరికమంటూ తీవ్రంగా ఖండించారు. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న మారణహోమంలో చిన్నారులు మహిళలుసహా 75 వేలమందికిపైగా ప్రాణాలు కోల్పోయినా, దాని గురించి తన ప్రసంగంలో మోడీ ప్రస్తావించకపోవడం గమనార్హం.

### ప్రధాని మోడీ అండగా నిలిచారు

ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో సభ్యులు లేచి నిలబడి ఘనంగా స్వాగతం పలికారు. అంతకు ముందు పార్లమెంట్‌లోని అతిథుల పుస్తకంలో మోడీ సంతకం చేశారు. మోడీని పొగడ్తలో ముంచెత్తిన నెతన్యాహు, 'ప్రధాని మోడీ మనకు అండగా నిలిచారు.' ఇజ్రాయిల్‌కు మంచి మిత్రుడు అని వ్యాఖ్యానించారు. దాదాపు 150కోట్ల మంది ప్రజా శక్తి కలిగిన భారత్ మహత్తరమైన శక్తి కలిగిన దేశం. దానితో పోలిస్తే ఇజ్రాయిల్ చాలా చిన్నది, అయినా శక్తివంతమైనదే, మన రెండు దేశాల మధ్య పొత్తు మన వ్యక్తిగత శక్తుల కన్నా అనేక రెట్లు ఎక్కువ. మీరు మాతో నిలిచారు." అని నెతన్యాహు పార్లమెంట్ నుద్దేశించి మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

# వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా



పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ చేసేనిరాధార ఆరోపణలకు సమాధానం చెప్పాలా

ఆరోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని కలగన్నామా? అజిత్ పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని.. అది ప్రమాదానికి గురవుతుందని ఊహించామా?. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకు నేను ఎందుకు సమాధానం చెప్పాలి? క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం చెబుతాం. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు అందిస్తా అని లోకేశ్ అన్నారు. చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారన్న బొత్స వ్యాఖ్యలపై కూడా లోకేశ్ స్పందించారు. జగన్ గజ దొంగ అని బొత్స చెబుతున్నారా.. జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా..? అని ప్రశ్నించారు.

జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకి తానెందుకు సమాధానం చెప్పాలి..? అని నిలదీశారు. క్లారిటీ ఇవ్వాల్సిన అవసరమున్న ప్రతి ప్రశ్నకు ధీటైన సమాధానం తాము చెబుతామని పేర్కొన్నారు. జగన్‌ను పట్టుకోమని ఆయన చెబుతున్నారా? అని నిలదీశారు. సిట్ అధికారుల విచారణలో తేలిందంతా అదే కదా అని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో తమపై ఆరుకు పైగా కేసులు పెట్టారని.. ఫైబర్‌నెట్, స్కిల్, ఇన్నర్ రింగ్ రోడ్డు, లిక్కర్, ఇసుక, అసైన్‌మెంట్ భూములపై కేసులు పెట్టారని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం పొందాలని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంత్రులకు అయితే గవర్నర్.. ఎమ్మెల్యేలు అయితే అసెంబ్లీ స్పీకర్ దగ్గర పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. గవర్నర్‌కు ఆధారాలు ఎందుకు చూపలేదని, ఒక్క ఆధారమైన చూపారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ హయాంలో పెట్టినవన్నీ తప్పుడు కేసులేనని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేకు ఓ యూనివర్సిటీ పెట్టామని, రెసిడెన్షియల్ క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. రెండు రోజుల పాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాస్‌లో ఉండాలని సూచించారు. ఈ ఒరియేనీటేషన్‌కి ప్రిన్సిపాల్ సీఎం చంద్రబాబు అని ప్రస్తావించారు. తాము అంతా విద్యార్థులమేనని.. ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగే సమావేశాలు.. రాజకీయాలకు అతీతమని... ఫ్యామిలీ కాన్సెప్ట్‌లోనే ఇది జరుగుతుందని వివరించారు. ఈ భేటీలో రాజకీయ ప్రస్తావన లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.

# తెలంగాణలో హత్యా రాజకీయాలు

మహబూబ్‌నగర్ **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో కుల వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప మృతిచెందిన ఘటనపై నాగర్‌కర్నూల్‌లో జరుగుతున్న ధర్నా శిబిరానికి పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ తదితరులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో మాటలకందని మహా విషాదం చోటు చేసుకుందని, సభ్య సమాజం తలదించుకునేలా పెత్తందార్ల వ్యవహార శైలి ఉందని అన్నారు. గుండెలు అవిసిపోయేలా హృదయవిధారకమైన ఘటన జరిగినప్పటికీ పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడం అప్రజాస్వామికమని తెలిపారు.

పేదలు దర్శనానికి వెళితే మరణ శాసనం లిక్కించిన పెత్తందారులను జైళ్లకు పంపాల్సిందేనన్నారు. ఇలాంటి అమానవీయ ఘటనలు జరిగినప్పుడు పోలీసులు సుమోటోగా కేసును స్వీకరించాల్సింది పోయి బాధితులు దరఖాస్తు పెట్టినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పసిపాపకు పాలు పట్టాల్సిన తల్లి కన్నీరు పెట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనానికి వెళ్లిన వారిని కులం పేరుతో అడ్డుకుని దాడి చేయడమే కాకుండా, బాధితులపైనే ఎదురు కేసులు పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో పాలకులు రాజ్యాంగాన్ని సైతం ఖననం చేశారని, పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ సామాన్యులకు న్యాయం దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పసికందు మృతికి కారణమైన ఎనిమిది మంది నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఉద్యమాల పురటి గడ్డలో ఇలాంటి ఘటన దారుణం : గోరటి వెంకన్న

ప్రముఖ నాయకులు, మాజీ మంత్రి మహేంద్రనాథ్‌తో పాటు అనేక ఉద్యమకారులకు పురుడు పోసుకున్న ఈ నేలలో పసికూనను పొట్టన పెట్టుకోవడం దారుణమని ఎమ్మెల్సీ, ప్రముఖ కవి, ప్రజావాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. పాలకులు ఎవరైనా సామాజిక బాధ్యతను విస్మరించరాదన్నారు. దోషులను అరెస్టు చేసి సామాజిక న్యాయాన్ని కాపాడే విధానం ఇక్కడినుండే ప్రారంభం కావాలని తెలిపారు. ఉద్యమాల చిరునామాగా నిలిచే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం దారుణమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

### పసికందు మరణంపై సీఎం స్పందించాలి : భూపాల్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. ప్రపంచం నివ్వెర పోయేలా పోలీసులు, అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ జిల్లా వాసిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి పసిపాప మరణంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యా నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మర్రి జనార్దన్ రెడ్డి, అంతటి కాశన్న, బీఎస్పీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎప్‌స్టీన్‌ను కలవడం తప్పే

## రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు నిజమే
## అయినా తానెలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడలేదు
## మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ఆవేదన

న్యూయార్క్, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయమై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై స్పందించిన ఆయన.. తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ గేట్స్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మాయిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణలపైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీకరించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు గేట్స్. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టిచూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆయన ఆవేదన చెందారు. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్య నిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతి ఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు.

# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

కడప **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**



కడప జిల్లా వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలోని నందీశ్వర ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్ పాల్గొన్నారు. శివ నామస్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణంలో జగన్ సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమాలు, ప్రత్యేక అభిషేకాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. "భక్తి మార్గం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పునర్నిర్మాణం జరగడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నందిపల్లిలో ఈ మహోత్సవాన్ని ఒక పండగలా నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు. కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, ఇతర సభ్యులను జగన్ ప్రత్యేకంగా అభినందించారు. నందీశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 8వ తరగతి పాఠ్యాంశంలో 'న్యాయవవస్థలో అవినీతి'

భాగాలను తొలగించేందుకు నిర్ణయించింది. పాఠ్యాంశంలో ఆవిధంగా వచ్చి ఉండాల్సింది కాదని, దీనికి బదులు స్ఫూర్తిదాయకమైన విషయాలను రాసి ఉండాల్సిందని కేంద్రం అభిప్రాయపడినట్టు ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి పాఠ్యాశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు బుధవారంనాడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం న్యాయవాదులు, న్యాయమూర్తులందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను' అని తెలిపారు. న్యాయవ్యవస్థలో అవినీతి గురించి 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహా రాజకీయ నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతుంటే ప్రభుత్వాలు ఎందుకు దాచిపెడుతున్నాయని ప్రశ్నించారు. ఎంపిక చేసి మరీ న్యాయవ్యవస్థనే నిలదీస్తున్నట్టు కనిపిస్తోందని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల న్యాయవ్యవస్థ అనే అధ్యాయాన్ని విస్తరించింది. న్యాయవ్యవస్థలో ఉన్న అవినీతి అంశాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టింది. విద్యార్థులు కేవలం సిద్ధాంత పరమైన అవగాహనకే పరిమితం కారాదని, వ్యవస్థలోని సవాళ్లు, లోపాలు, వాస్తవ పరిస్థితుల గురించి కూడా తెలుసుకోవాలనే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్టు చెబుతోంది. లక్షలాది కేసులు, విచారణలో జరుగుతున్న జాప్యం వంటి అంశాలను పాఠ్యాంశంలో ప్రస్తావించింది. అయితే పాఠ్యాంశంలో తాజా మార్పుల వల్ల చిన్నారులలో న్యాయవ్యవస్థపై ప్రతికూల భావన పెరగవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# స్పీకర్ కోర్టులో మరో ఇద్దరి భవితవ్యం

ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్యేల వ్యవహారాన్ని తేల్చబోతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దాఖలైన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణకు తమ వాదనలను వినిపించడంతోపాటు సాక్ష్యాధారాలను సమర్పించాల్సి ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. స్పీకర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఎదుట పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అడిగే ప్రశ్నలకు దానం, కడియం సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరలేదని నిరూపించుకోవడానికి అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుంది. గత నెల 18న ఈ కేసులో పిటిషనర్ పాడి కౌశిక్‌రెడ్డిని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. 19న కడియం తరఫు లాయర్లు వివేకానందగౌడ్‌ను ప్రశ్నించారు. స్పీకర్ జారీచేసిన విచారణ షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 27వ తేదీన ఉదయం 11:00 గంటలకు విచారణ ఉంటుంది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 12:00 గంటలకు విచారణ చేపడుతారు. 28వ తేదీన ఉదయం 11:00 గంటలకు బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఉంటుంది. ప్రతివాది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తరఫున సాక్ష్యాధారాలను సేకరిస్తారు.

# సోలార్ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలి.


## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 25:**
జిల్లాలో అమలులో ఉన్న సోలార్ విద్యుత్ పథకాల పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు, సోలార్ వెండర్లతో కలిసి వివిధ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు.
జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పీఎం–కుసుమ్–సి పథకం కింద జిల్లాలో చేపట్టిన 9 పనులలో 4 పనులకు ఇప్పటికే స్థలాలు ఖరారు చేసామని మిగిలిన పనులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరారైన 4 పనులకు తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రైతులకు పగటి పూట నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 117 ఎకరాల విస్తీర్ణంలో 29 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి 'వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'కు లెటర్ ఆఫ్ అవార్డ్ జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 13,595 వ్యవసాయ పంప్‌సెట్లకు నిరంతర సౌర విద్యుత్ సరఫరా కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.
పీఎం సూర్యఘర్ & రూఫ్‌టాప్ సోలార్
మరియు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. CAPEX విధానం కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు కేటాయించిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేయాలని వెండర్లను ఆదేశించారు. ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బంది, సోలార్ వెండర్లు సంయుక్తంగా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణ సౌకర్యాల వివరాలను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేసి రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సోలార్ ప్రాజెక్టుల సమర్థ అమలుతో రైతులు, గృహ వినియోగదారులు తక్కువ ఖర్చుతో పునరుత్పాదక శక్తి ఆధారిత నాణ్యమైన విద్యుత్‌ను పొందగలరని కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు శాశ్వత విద్యుత్ పరిష్కారాల దిశగా జిల్లా ముందంజలో నిలవాలని ఆమె ఆకాంక్షించారు.

# వక్తల శిక్షణకు తప్పనిసరి హాజరు



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 25:**నంద్యాల జిల్లా బిజెపి తరఫున వక్తలుగా నియమితులైన 50 మంది నాయకులు మరియు జిల్లా శిక్షణ కన్వీనర్లు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు స్పష్టం చేశారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా జరిగే శిక్షణల్లో వక్తలుగా పాల్గొనాల్సిన వారికి ప్రత్యేక సన్నాహక శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ఎలా సిద్ధం కావాలి, ఏ అంశాలపై మాట్లాడాలి వంటి విషయాలపై మార్గదర్శనం అందించనున్నట్లు చెప్పారు. ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు అనంతపురం జిల్లా బిజెపి కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని వక్తలు, శిక్షణ కన్వీనర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అలాగే జిల్లా శిక్షణ కన్వీనర్లు, కో–కన్వీనర్లు తమకు కేటాయించిన అసెంబ్లీ పరిధిలోని వక్తలకు వెంటనే సమాచారం అందించి, వారిని శిక్షణ సన్నాహక సమావేశానికి హాజరు చేయాలని సూచించారు.

# పెండింగ్ మ్యుటేషన్లను గడువులోగా పరిష్కరించండి.

## ప్రజా సేవల్లో 80% సానుకూలత లక్ష్యం. -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 25:**
భూసమస్యలకు సంబంధించి పెండింగ్ మ్యుటేషన్లను గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మండల తాసిల్దార్లకు రెఖీవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాల్లో ప్రభుత్వ ఆదేశాల అమలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ రికార్డుల నమోదు ప్రక్రియను గడువులోగా ముగించాలని స్పష్టం చేశారు. సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ గడువులు దాటకుండా ప్రతి దరఖాస్తును సమయపాలనతో పరిష్కరించాలని తెలిపారు. కోటపాడు వంటి గ్రామాల్లో రికార్డుల నమోదులో చోటుచేసుకున్న పొరపాట్లను గమనించిన కలెక్టర్, బాధితులకు తక్షణ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీలో ఉన్న పెండింగ్‌ను పూర్తిగా క్లియర్ చేయాలన్నారు.
ప్రభుత్వ సేవలపై ప్రజల సానుకూల భావన 80 శాతం పైగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' పథకం కింద అర్బన్ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థల సర్దుబాటు, కొత్త ఇంటి స్థలాల సేకరణపై సమగ్ర నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పని ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే జాయింట్ కలెక్టర్ లేదా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజా సేవలలో పారదర్శకత, వేగం, నాణ్యత ఉండేలా ప్రతి అధికారి కట్టుబడి పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తిక్, డిఆర్ఓ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సాధనకై వైఎస్ఆర్ సిపి పిలుపు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 25:**
రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సాధనకై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మార్చి 1 వ తేదీ కడపలో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలన్న జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. రాయలసీమ సస్యశ్యామలంగా మారాలంటే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఎంతో అవసరం అని మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు స్వార్థ రాజకీయం కోసం సీమ ప్రజలను , రైతులకు తీరని అన్యాయం చేస్తున్నడని విమర్శించారు. ఆనాడు దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ కు ఎంతో మేలు చేస్తే నేడు చంద్రబాబు రాయలసీమ కు తీరని అన్యాయం చేయడం బాధాకరమని వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య, నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల టౌన్‌లో గంజాయి అక్రమ రవాణా.!

## ..ఇద్దరు అరెస్ట్, 2 కిలోల గంజాయి స్వాధీనం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ ఫిబ్రవరి 25:**
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము గాంజా మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనలో భాగముగా ప్రతిష్టాత్మకముగా చేపట్టిన ఆపరేషన్ "వజ్ర ప్రహార్" అను కార్యక్రమములో భాగముగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, ఎస్డిపిఓ నంద్యాల ఎం.జావళి పర్యవేక్షణలో, నంద్యాల జిల్లా, నంద్యాల 1 టౌన్ పోలీస్ స్టేషన్ సి ఐ, వారి సిబ్బంది కలిసి, విశ్వసనీయ సమాచారం ఆధారంగా నంద్యాల టౌన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి, వారిని అరెస్టు చేసి, వారి నుండి సుమారు 2 కేజి ల గంజాయిని మరియు రెండు సెల్ ఫోన్ లను స్వాధీనము చేసుకోడమయినది.
జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి ఉంచాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, నంద్యాల ఎస్డిపిఓఎం.జావళి ఆల్ఫోన్స్ పర్యవేక్షణలో 24.02.2026 తేదీ సాయంత్రం 17.00 గంటలకు నంద్యాల టౌన్ జగజ్జనని నగర్, చెరువుకట్ట , మల్లెలమ్మ గుడి వెనుక ప్రాంతంలో దాడి నిర్వహించగా
దాసరి కళ్యాణ్ (22 సం.), వా/శీ వెంకటేశ్వర్లు, నివాసం: బైటిపేట, ప్రస్తుతం నందమూరి నగర్, నంద్యాల మండలం
మాందాపురం మనోహర్ (23 సం.), వా/శీ లేట్ నరసింహుడు, నివాసం: బైటిపేట, నంద్యాల
అను వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు 2 కిలోల గంజాయి మరియు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడమైనది.
వారి ఇద్దరిలో ఒకరైన దాసరి కళ్యాణ్ పై గతంలో సారాయి కేసు కూడా వున్నది.
గత కొద్ది రోజుల క్రితము నుండి వారు మద్యం త్రాగడము మరియు గంజాయి ఇతర చెడు అలవాట్లకు లోనై, జల్సాలు చేస్తూ, గంజాయి సేవిస్తూ తిరుగుతూ ఉండేవారు. ఆ క్రమములో వారు అప్పుడప్పుడు గంజాయి కోసం వైజాగ్ దగ్గర గల అరకుకు వెళ్ళి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కెజి 4 వేల రూపాయలకు కొనుగోలు చేసి నంద్యాలకు తెచ్చుకొని వారు ఇద్దరు సమానముగా గంజాయి పంచుకొని, ఇక్కడ 10 గ్రాముల ప్రకారము చిన్న చిన్న ప్యాకెట్స్ గా తయారు చేసి, 100 గ్రాముల ప్యాకెట్ సుమారు =o 2000/- రూపాయల చొప్పున అధిక లాభము వచ్చేలా నంద్యాల టౌన్ లో కాలేజీ విద్యార్థులకు, సాధువులకు మరియు నంద్యాల టౌన్ లో అక్కడక్కడ గంజాయికి అలవాటు పడిన వ్యక్తులకు అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు.
గంజాయి విక్రయాన్ని అడ్డుకుని నిందితులను పక్క సమాచారంతో పట్టుకున్న నంద్యాల 1 టౌన్ ఇన్స్పెక్టర్ జి. సుధాకర్ రెడ్డిని, వారి సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
**ప్రజలకు, విద్యార్థులకి పోలీసుల శాఖ తరుపున సందేశం:**
గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా మరియు విక్రయం చట్టవిరుద్ధం.
మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయి. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.
ఇంటర్, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కాలేజ్ ల యాజమాన్యాలు వారి వారి విద్యార్థులకి తరచుగా మత్తు పదార్థాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలి.

# చిన్నారి పునర్విక వైద్యం కోసం పి ఎం సహాయ నిధి రూ. 50 లక్షలు మంజూరు చేయించా.

## -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 25:**
నంద్యాల పట్టణం బొమ్మల సత్రం లోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ కార్యాలయంలో ఇటీవల నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి నిర్వహించిన ప్రజా దర్బార్‌లో చిన్నారి పునర్విక తల్లితండ్రులు తమ కుమార్తె అరుదైన వ్యాధితో బాధపడుతుందని, వైద్యం కోసం సహాయం కోరుతూ నా దృష్టికి తీసుకువచ్చారనీ. వారి ఆవేదనను విని వెంటనే స్పందించి, పునర్వికకు అవసరమైన వైద్య సహాయం తప్పకుండా అందిస్తామని భరోసా ఇచ్చాననీ, నా ప్రయత్నాల ఫలితంగా పునర్విక చికిత్స కోసం ప్రధాని సహాయ నిధి నుంచి రూ.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి బుధవారం అన్నారు. ఇది పునర్విక కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చే విషయమని, ఈ సహాయం సాధ్యమయ్యేలా సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా కేంద్ర వైద్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని. ప్రజల ఆరోగ్యం నా మొదటి బాధ్యత అంటూ చిన్నారి పునర్విక త్వరగా కోలుకుని ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్షతో, ఆమె కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా ఇచ్చారు.

# బడికోసం మాస్టారు కృషి అభినందనీయం

## మంత్రి లోకేశ్ ప్రశంసలు



అమరావతి, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి** కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం సగరపేటలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ పీవీవీ. సత్యనారాయణ మాస్టారు బడి బాగు కోసం చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. సొంత నిధులు దాదాపు రూ.10 లక్షలు, దాతల విరాళాలు రూ.1.80 లక్షలతో కార్పొరేట్ స్కూలుని తలదన్నేలా తీర్చిదిద్ది స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. క్లాసు రూమ్‌లో టైల్స్, గ్రౌండ్ ఫ్లోరింగ్, పెయింటింగ్, వాల్ రైటింగ్, కాంపౌండ్ వాల్ రంగులతో కొత్తందాలు సంతరించుకునేలా చేశారని కీర్తించారు. నాలుగు కంప్యూటర్లతో డిజిటల్ క్లాస్ రూం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయుల సహకారంతో వచ్చే విద్యా సంవత్సరంలో 64 మంది పిల్లలు కొత్తగా బడిలో చేరుస్తున్న మీ అంకితభావానికి హ్యాట్సాఫ్ అన్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా సహాయం అందిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# హైకోర్టులో ఐపిఎస్ అధికారి నాయక్ ముందస్తు బెయిల్

అమరావతి, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి** ఏపీ హైకోర్టులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. రఘురామ అరెస్ట్ సమయంలో ఏపీ సీఐడీ ఎస్పీగా ఆయన ఉన్నారు. రెండు రోజుల క్రితం సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ దామోదర్ బిహార్ వెళ్లారు. ఈ క్రమంలోనే ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది బిహార్ కోర్టు. దీంతో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు సునీల్ నాయక్. ముందస్తు బెయిల్ పిటిషన్ రేపు(గురువారం) విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ నగదు రహిత వైద్య సహాయం.

## పీఎం రాహత్ పథకాన్ని విస్తృతంగా వినియోగించాలి.

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 25:**



రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ, నగదు రహిత వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారి, మునిసిపల్ కమిషనర్లు, రోడ్లు మరియు భవనాలు శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తొలి 7 రోజుల్లో ఒక్కొక్కరికి గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించబడుతుందని కలెక్టర్ తెలిపారు. పోలీసుల ధృవీకరణ అనంతరం సాధారణ గాయాల కేసుల్లో 24 గంటల పాటు, తీవ్ర గాయాల కేసుల్లో 48 గంటల పాటు స్థిరీకరణ వైద్య సేవలు అందించబడతాయని వివరించారు. ఈ పథకం కింద ఆసుపత్రులకు చెల్లింపులు మోటారు వాహన ప్రమాద నిధి ద్వారా చేయబడతాయి. ప్రమాదానికి కారణమైన వాహనం బీమా చేయబడినట్లయితే బీమా సంస్థలు వ్యయాన్ని భరిస్తాయి. బీమా చేయని వాహనాల సందర్భంలో, భారత ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల ద్వారా ఖర్చును భరిస్తుందని తెలిపారు. ఈ పథకం ప్రజలకు అత్యంత ప్రయోజనకరమని, రోడ్డు ప్రమాదాల అనంతరం బాధితులకు ఆలస్యం లేకుండా వైద్య సహాయం అందించడంలో ఇది కీలకంగా పనిచేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి పథకం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాన్ని తగ్గించడంలో అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.

## మంత్రి నారా లోకేష్ ఆత్మీయ విందు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్ , ఎన్ఎండి ఫిరోజ్.

**ఆంధ్ర ప్రగతి ఉండవల్లి, మంగళవారం ఫిబ్రవరి 25:**



నారా లోకేష్ గారు రాష్ట్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నంద్యాల పార్లమెంటు పరిధిలోని తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు మరియు వారి కుటుంబ సభ్యుల కోసం మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆత్మీయ సమావేశం మరియు విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్యులు, నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండి ఫరూక్, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ఆత్మీయ సమావేశంలో నంద్యాల పార్లమెంటు పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు . పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిగాయి.


## "ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు"..

### అధికారులతో సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**



ప్రజారోగ్యం విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. శ్రీకాకుళంలో విజృంభిస్తున్న డయేరియా, రాజమహేంద్రవరంలో కలకలం రేపిన కల్తీ పాల ఘటనలపై బుధవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళంలో డయేరియా బారిన పడి ప్రస్తుతం 76 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని.. ఒకరికి వెంటిలేటర్‌పై, మరొకరికి డయాలసిస్ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా క్లీన్ డ్రింకింగ్ వాటర్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కాగా, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా స్వయంగా పర్యవేక్షించాలని సీఎం సూచించారు. రాజమహేంద్రవరం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. పాల శాంపిల్స్ నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మున్సిపల్, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు.



## తిరుమలలో నేటి నుంచి తెప్పోత్సవాలు

తిరుమల, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

తిరుమలలో గురువారం నుంచి మార్చి 2 వరకు శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు జరగనున్నాయి. ప్రతిరోజూ రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొలిరోజు శ్రీసీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి, 27న రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి విహరిస్తారు. 28న, మార్చి 1, 2 తేదీల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పుష్కరిణిలో విహరించనున్నారు.

# పాల విక్రయ కేంద్రాల్లో పై

# ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 25:**

ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి జిల్లాలో కల్తీ పాలు తాగి నలుగురు మరణించిన విషయం తెలిసిందే, ఈ సంఘట అయితే ఈ సంఘటన జరిగినటువంటి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలోని పాల విక్రయ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో, రాష్ట్రంలో పాల కల్తీ తో పలువురు ప్రాణాలు,కొందరికి అస్వస్థత కు గురికావడంతో ప్రభుత్వం పాల విక్రయకేంద్రలపై దాడులు నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలోనే నంద్యాల పట్టణంలో అర్బన్,రూరల్ ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు ఆధ్వర్యంలో తనికీలు నిర్వహిస్తున్నారు. పాలను ప్రత్యేక కిట్ల ద్వారా తనికీలు ముమ్మరం చేస్తున్నారు. మరో వైపు చిన్న,చిన్న



పాల కేంద్రాలపై దాడులు చేస్తున్నారు కానీ పెద్ద పెద్ద పాల కేంద్రాల్లో సైతం తనికీలు చేయాలని పలువురు వ్యాపారులు కోరుతున్నారు. మరో వైపు ఇచ్చే పాలు ఇచ్చే మూగజీవాలు అధికంగా పాలు వచ్చే విధంగా ఇంజెక్షన్లు వేయడం కూడా అరికట్టాలని కోరుతున్నారు. ఆ ఇంజెక్షన్లు విక్రయాలు లేకుండా అరికడితే స్వచ్ఛమైన పాలు లభిస్తాయి. సంఘటన జరిగినపుడు కాకుండా నిత్యం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనికీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నంద్యాల కూరగాయల మార్కెట్ సమీపంలో బేకరీలు,దుకాణాలలో తినుబండారాలు విక్రయించే వారిపై స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నట్టు సమాచారం. కేకులు,బ్రెడ్,బన్ను,బిస్కెట్స్, స్వీట్స్ కు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విక్రయాలు సాగిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. మరో వైపు ఆ ప్రాంతంలో కోట్లలో జీరో వ్యాపారం సాగిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. సిగరెట్లు కొత్త ధరలు రాకపోయినా భారీ ధరలు పెంచి సొమ్ముచేసుకుంటున్నా చర్యలు శూన్యం.

# సునీల్ నాయక్ హక్కులను

# కాల రాస్తే ఉపేక్షించేది లేదు.

**ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మండిపాటు.**

**గిరిజనుడిగా పుట్టడమే సునీల్ నాయక్ ఐపీఎస్ చేసిన నేరమా?**

**గిరిజరులు ఉన్నత స్థానాల్లో ఉంటే జీర్ణించుకోలేరా..?**

**ఆంధ్రప్రదేశ్ నంద్యాల ఫిబ్రవరి 25:**

**సునీల్ నాయక్ ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 25:**

గిరిజన ఐపీఎస్ సునీల్ నాయక్పై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా.. ఆయనకు గల రాజ్యాంగబద్ధ హక్కులను కూటమి ప్రభుత్వం కాలరా స్తోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మండిపడ్డారు. అందుకోసం సీఎం చంద్రబాబు ఏకంగా బిహార్ ముఖ్య మంత్రి నితీశ్ కుమార్తో మాట్లాడి మరీ ఒత్తిడి తేవడం పట్ల బుధవారం ఆయన ఒక ప్రకటన లో ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ ఒక గిరిజన జాతిలో ఐపీఎస్ అధికారిగా పుట్టడమే సునీల్ నాయక్ చేసిన నేరమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉన్నత స్థానాల్లో గిరిజనుడు నివసించే హక్కు లేదా అన్నారు. ఒక ఐపీఎస్ అధికారిని టార్చర్ పెడుతూ మానసికంగా వారి తల్లిని అవమానపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా గోడదూకి సునీల్ కుమార్ ఇంట్లోకి ప్రవేశించి ఆయనను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఎస్పీ దామోదర్ తోపాటు ఇతర ఏపీ పోలీసులపై బిహార్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆన్లైన్ విధానం లో ఆయన చేసిన ఫిర్యాదుపై బిహార్ పోలీసులు కేసు నమోదుకు సిద్దమవుతున్నారని తెలిసి చంద్రబాబు రంగంలోకి దిగారని రాజు నాయక్ చెప్పారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్కుమా ర్ తో మాట్లాడి ఏపీ పోలీసులపై కేసు నమోదు కాకుండా ఒత్తిడి చేశారని విమర్శించారు. అం దుకే సునీల్ నాయక్ ఐపీఎస్ ఫిర్యాదుపై బిహార్ పోలీసులు ఇంకా కేసు నమోదు చేయకుండా జాప్యం చేయడం ఎంతవరకు సమంజసం ఉన్నారు.. చంద్రబాబు సామాజి కవర్గానికి చెందిన ఎస్పీ దామోదర్, ఆయన బృందం గిరిజన ఐపీఎస్ సునీలా నా యక్పై అత్యంత అగౌరవంగా, అవమానకరం గా వ్యవహరించిందని మండిపడ్డారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకొని గిరిజనుడైన సునీల్ నాయక్ క్ కి క్షమాపణ చెప్పాలన్నారు.

# దళిత మాదిగలకు రక్షణ కల్పించాలి

**: ఎమ్మార్పీఎస్ ఐక్యత మహాసభ డిమాండ్**

**టీఎం రమేష్ కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్రేషియా, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి**

**కర్నూలు ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

కర్నూలు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) సంఘాల ఐక్యత మహాసభ నిర్వహించారు. ఇటీవల ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ మాదిగ హత్యకు గురైన నేపథ్యంలో ఈ నిరసన సభను ఏర్పాటు చేశారు. సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ, మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన మాదిగ దండోరా ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిందన్నారు. అయితే కొందరు స్వలాభం కోసం ఉద్యమాన్ని ఉపయోగించుకుంటూ మాదిగలకు రక్షణ కల్పించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలతో చేతులు కలుపుతున్నారని ఆరోపించారు. అగ్రవర్ణాల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ. 1 కోటి ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, ఐదు ఎకరాల భూమి, ఐదు సెంట్ల ఇంటి స్థలం కేటాయించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మాదిగలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో మాదిగలపై హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రక్షణ కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ మాట్లాడుతూ, టీఎం రమేష్ హత్య జరిగి దాదాపు నెల రోజులు గడిచినా కుటుంబానికి సరైన రక్షణ, ఆర్థిక సాయం అందలేదని పేర్కొన్నారు. కుటుంబ జీవనోపాధి దృష్ట్యా ఒకరికి తక్షణమే ఉద్యోగం కల్పించాలని కోరారు.



ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు మాదిగ మాట్లాడుతూ, మాదిగలపై దాడులు కొనసాగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. హత్యలు, అత్యాచారాలకు గురైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మార్పీఎస్ మహిళా నాయకులు అడ్డాకుల నాగేశ్వరి, రెడ్డిపోగు కళావతి మాదిగలు మాట్లాడుతూ, మాదిగలంతా ఏకమై హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు మహిళలు కూడా ఉద్యమాల్లో ముందుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీఎం రమేష్ కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా, నగర స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం !

**ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

ప్రపంచంలో ఏ యుద్ధాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే... అమెరికా దానిని నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, ఎలన్‌స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదెయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు. నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్ధాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్ధాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్నుల విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. పన్నెండున్నర లక్షల మంది రష్యన్లు మరణించి నట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా పన్నెండు లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగలేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వ మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది. ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన




తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించి నప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్‌స్కీ పట్టుబడుతున్నాడు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు
స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్‌స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్ధానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకొనేందుకు పుతిన్ సిద్ధంగా లేడు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూ భాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్‌స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చు కోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పాడు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్థమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కూర్చుంటేనే సయోధ్య కుదరగలదు. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.

## రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో 2,721 డయాలసిస్ మిషన్లు

### మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి, ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,721 డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. ఏపీలో డయాలసిస్ కేంద్రాల సంఖ్య పెంపుపై శాసనమండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానం ఇచ్చారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు



తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 14 కొత్త డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. గతంలో నెలకు సుమారు 40 వేల డయాలసిస్ సెషన్లు జరుగగా... ప్రస్తుతం 66 వేల సెషన్లకు పెరిగాయని మంత్రి తెలిపారు. 675 మంది పేషెంట్లకు నెలకు 10 వేల రూపాయల చొప్పున పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగులకు కూడా పింఛన్లు అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. కిడ్నీ రోగుల చికిత్సపై సగటున 86 వేల రూపాయల చొప్పున గత 20 నెలల్లో మొత్తం 224 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

### కేంద్రం చర్యను తప్పపట్టిన ప్రియాంక

న్యూఢిల్లీ **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**



ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్– అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెత్తారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఃూగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

# విద్యార్థులతో పవన్ ముచ్చట్లు

**అమరావతి ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**

ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. చర్చలను వీక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అనుమతిస్తున్న విషయం తెలిసిందే. పలు పాఠశాలల విద్యార్థులను విడతల వారీగా సభకు అనుమతిస్తున్నారు. 25-40 నిమిషాల వరకు సభా కార్యకలాపాలను వీక్షించేందుకు.. విద్యార్థులను అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం అమృత లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వచ్చారు.

అసెంబ్లీ సమావేశాలను గ్యాలరీలో కూర్చుని వీక్షించారు. అనంతరం.. విద్యార్థులు.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా.. ఇతర మంత్రులను కలుసుకున్నారు. వారితో ఫొటోలు దిగారు. అనంతరం.. పవన్ కల్యాణ్ విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. --సీఎం సార్ ప్రసంగం విన్నారా-- అంటూ.. పలువురు విద్యార్థుల ను ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుకు సుదీర్ఘ అనుభవం ఉందని.. ఆయన పాలనా దక్షుడని విద్యార్థుల కు తెలిపారు. ఆయన ప్రంగాన్ని వినే అవకాశం రావడం అదృష్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను విద్యార్థిగా ఉన్నప్పుడు.. అసెంబ్లీ సమావేశాలను వీక్షించే అవకాశం రాలేదని.. పవన్ కల్యాణ్ తెలిపారు.



పుస్తకాల్లో చదువుకున్నానని చెప్పారు. బలమైన నాయకులుగా ఎదగాలంటే నిరం తరం అధ్యయనం చేయాలని, చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. తరచుగా గ్రంధాలయాలకు వెళ్లాలని.. మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకోవాలని తెలిపారు. అధ్యయనంతోనే అన్నీ అలవడు తాయని చెప్పారు. ప్రతి విషయాన్నీ నిశితంగా గమనించాలని సూచించారు. అనంతరం.. విద్యార్థులు.. స్పీకర్ అయ్యన్న పాత్రుడిని కలుసుకున్నారు. ఆయన సైతం విద్యార్థుల ను పలు ప్రశ్నలు అడిగారు. సభలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయని.. వీటిపై ఆసక్తి ఉందా? అని ప్రశ్నించా రు. పాఠశాలల్లోనూ మాక్ అసెంబ్లీలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులకు స్పీకర్ సూచించారు. తద్వారా చట్ట సభల వ్యవహారంపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందని చెప్పారు

## ఆస్పత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జ

ముంబయి, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి:** : ఇటీవల అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం ఎన్‌సిపి నేత శరద్‌పవార్ పూనెలోని రూబీ హాల్ ఆసుపత్రిలో చేరారు. డీహైడ్రేషన్‌కు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ఆదివారం ఈ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడడంతో బుధవారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం శరద్‌పవార్ బాగానే ఉన్నారు. అందుకే ఆయనను డిశ్చార్జ్ చేశాం. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించాం అని రూబీ హాల్ ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్, ఛైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ అయిన డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ అన్నారు. ఃూగా, శరద్‌పవార్ ఈ నెల్లోనే ఫిబ్రవరి 9న ఛాతి ఇన్ఫెక్షన్ వల్ల ఇదే ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. ఆరోగ్యం మెరుగుపడగానే ఆయన ఫిబ్రవరి 14న డిశ్చార్జ్ అయ్యారు.

## ఉదయ్‌పూర్‌లో విరోష్ పెళ్లిసందడి

### హాజరవుతున్న అంబానీ కుటుంబం

ఉదయ్‌పూర్, **ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి**



టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న వివాహ వేడుకలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 26న జరగనున్న ఈ ప్రైవేట్ వెడ్డింగ్‌కు సంబంధించిన ప్రీవెడ్డింగ్ వేడుకలు ఇప్పటికే పీక్స్‌కు చేరుకున్నాయి. కేవలం 100 మంది అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుక జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్‌కు చేరుకోవడంతో జోరుగా చర్చ మొదలైంది. ఆయనతో పాటు నీతా అంబానీ, కోకిలాబెన్ అంబానీ, ఆకాశ్ అంబానీ, శ్లోకా అంబానీ కూడా వచ్చినట్లు ప్రచారం సాగింది. దీంతో అంబానీ కుటుంబం విరోష్ వెడ్డింగ్‌కు హాజరవుతున్నారన్న వార్తలు వైరల్ అయ్యాయి. అయితే తాజా సమాచారం ప్రకారం అంబానీ కుటుంబం ఉదయ్‌పూర్ సందర్శనకు ఈ వివాహంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైంది. ఉదయ్‌పూర్ సమీపంలోని నాథ్‌ద్వారాలో ఉన్న శ్రీనాథ్ జీ ఆలయంలో దర్శనం కోసం అంబానీ కుటుంబ సభ్యులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆలయం వద్ద తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు వాటిని విరోష్ వెడ్డింగ్‌కి అటాచ్ చేశారు. అయితే ఇది కేవలం యాదృచ్ఛికమేనని, పెళ్లికి సంబంధం లేదని సమాచారం. ఈ సెలబ్రిటీ వివాహం పూర్తిగా ప్రైవేట్ వేడుకగా జరుగుతోంది. ఇప్పటికే ఉదయ్‌పూర్ విమానాశ్రయంలో కనిపించిన వారిలో దర్శకుడు తరుణ్ భాస్కర్, నటి ఈషా రెబ్బా, నటి ఆషికా రంగనాథ్, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తదితరులు ఉన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా హాజరయ్యే అవకాశమున్నట్లు టాక్ వినిపిస్తోంది.వివాహ విందు పూర్తిగా దక్షిణాది శైలిలో ఉండబోతోందని సమాచారం. అతిథులకు అరిటాకుల్లో భోజనం వడ్డించనున్నారు. ప్రత్యేకంగా కొబ్బరి నీళ్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి సరదా క్రీడలతో సందడి చేశారు. ఫిబ్రవరి 26, 2026న ప్రధాన వివాహం జరగనుండగా, సినీ పరిశ్రమ స్నేహితుల కోసం మార్చి 4న ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మొత్తానికి, అంబానీలు ఉదయ్‌పూర్‌లో ఉన్నారన్న విషయం నిజమే అయినప్పటికీ, అది విజయ్ దేవరకొండ,రష్మిక మందన్న పెళ్లితో సంబంధం లేదని సమాచారం.

--------------

## తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

### క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపిన అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 25ఆంధ్ర ప్రగతి** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే చేరుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను ఆయా కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి సెండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 1495 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9.97 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇంటర్ పరీక్షలకు హాల్ టికెట్ ఉంటేనే అనుమతిస్తున్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను పరీక్షకు అనుమతిస్తారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా ఎంట్రీ ఉంటుంది. ఒక్క హాల్‌టికెట్ వెంట ఉంటే సరిపోతుంది. ఎలాంటి గుర్తింపు పత్రాలు అవసరంలేదు. ఃూజాగా సమాధాన పత్రాల మూల్యాంకనం షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు ప్రకటించింది. మార్చి 4 నుంచి సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుంది. మార్చి 15నుంచి మొదటి విడత, మార్చి 18నుంచి రెండో విడత, మార్చి 20 నుంచి మూడో విడత మూల్యాంకనం ప్రారంభమవుతుంది. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు విడుదల చేస్తారు.